# వాంగ్మూలం

-డాక్టర్ జె.భాగ్యలక్ష్మి

సౌరభ్ నిద్ర లేచినట్టున్నాడు. వాళ్ళమ్మ హడావుడిగా వాడి గదివైపు వెళ్ళటం చూశాను. ఈ రోజు ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు వాడికి బెస్ట్ విషెస్ చెప్పి ఆనందంలో ముంచెత్తుదామా అని వారం రోజులుగా చూస్తున్నాను. శుభాకాంక్షలకే వాడి మనసు ఉప్పొంగదు. కానీ నేనిచ్చే కానుక... ఈ విషయమై వాళ్ళమ్మకు కూడా తెలీదు. శుభాంగి సౌరభ్‌కు కొత్తబట్టలు కొన్నదని తెలుసు. నేనేమి గిఫ్ట్ ఇస్తానా అని మాటల సందడిలో ఆరాలు తీస్తూనే ఉంది. అమ్మా... నేనా దొరికేది!

న్యూస్ పేపరు చదవటమయింది. దానితో పాటు రెండు కప్పుల టీ కూడా ముగిసింది. గోడ గడియారం వైపు చూశాను. పది కావస్తోంది. మా వాడి స్నాన పానాదులు ముగిసుంటాయి. ఇక ఏ క్షణాన్నయినా టిఫిను తినడానికి వస్తాడు. ఇంతలో గేటు వద్ద కారాగిన చప్పుడు. నేను గబగబా బయటకు వెళ్ళాను. అవతలి అతను రిజిస్ట్రేషను కాగితాలు, తాళం చెవి నా చేతిలో పెట్టాడు. నిగ నిగలాడుతూ ఎర్రగా మెరుస్తోంది జెన్. అతనికి థ్యాంక్స్ చెప్పి నేను లోపలికి వచ్చాను.

"గుడ్ మార్నింగ్ డాడీ" సౌరభ్ కొత్త బట్టల్లో మెరుస్తున్నాడు.

"గుడ్ మార్నింగ్. మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే. హాపీ బర్త్ డే".

"థాంక్యూ డాడీ" అర్థవంతంగా నా వైపు, నా చేతులవైపు చూసి డైనింగ్ టేబిల్ వైపు కదిలాడు. నేను వాడి చెయ్యి గట్టిగా పట్టుకొన్నాను.

"ఏమిటి డాడీ".

"ఇలా రా చెపుతాను" అంటూ చెయ్యి పట్టుకొని గేటు వైపు తీసుకెళ్ళాను.

"అదేమిటి వాడిని టిఫిను తిననివ్వకుండా ఎక్కడికి తీసుకెళ్తున్నారు?" అంటూ మమ్మల్ని ఆపటానికా అన్నట్టు శుభాంగి మా వెంటే వచ్చింది.

గేటు దగ్గరకు రాగానే కారు చూచి వాడు "వావ్" అన్నాడు. ఇంతలో వాడి చేతిలో తాళం చెవి పెట్టి "నీ బర్త్ డే గిఫ్ట్" అన్నాను. వాడి ఆనందం వర్ణించటానికి వీలు కాదు. ''థాంక్యూ, థాంక్యూ'' అంటూ పొంగిపోయాడు. శుభాంగి కూడా ఉబ్బితబ్బిబ్బవుతోంది. "నాతో మాట మాత్రమైనా చెప్పలేదే" అంది కొంచెం నిష్ఠూరంగా.

"ముందే చెప్తే ఈ ఆశ్చర్యం, ఆనందం ఎలా కలుగుతాయి? మీ ఆనందం చూసి నేను ఆనందించవద్దా?"

ఇంతలోనే సౌరభ్ డ్రైవర్ సీట్లో కూర్చుని అన్ని హంగులూ చూస్తున్నాడు. స్టీరియో, ఏ.సి., ఇతర డెకొరేషన్లు గమనిస్తున్నాడు. మరింకేమి కావాలో ఆలోచిస్తున్నాడేమో! అదేమంత భాగ్యం. వాడు మాట మాత్రంగా అనాలేగాని వాడు కోరినవన్నీ అమరి పోవూ!

సౌరభ్ మా ఒక్కగానొక్క సంతానం. మా ఆశలు, ఆనందాలు అన్నీ వాడే. మా ఇద్దరి జీవితాలు మా సౌరభ్‌కే అంకితం. మాకు అంటూ వేరే ప్రపంచమే లేదు. నా షేర్లు, పెట్టుబడులు, నా కన్సల్టన్సీలు, సంపాదన అన్నింటికీ ఒకే ఒక ధ్యేయం... మా వాడి ఆనందం. మా జీవిత లక్ష్యమేమిటో మా వాడు పుట్టిననాడే తెలిసిపోయింది.

ఆ రోజు ఉదయం టిఫిన్‌లో రకరకాలు ప్రత్యక్ష మయ్యాయి. సౌరభ్‌ను "తిను బాబూ. ఇది రుచి చూడు. అది కొంచెం వేసుకో. కొంచెమంటే కొంచెం. నీ కోసం ప్రత్యేకంగా తెప్పించాను. ఇది నీకు ఇష్టమైన ఐటెమ్..." అంటూ వాళ్లమ్మ బుజ్జగించి, బుజ్జగించి తినిపిస్తోంది.

సౌరభ్ బీరువాలో నుండి డబ్బు తీసుకొని పర్సులో పెట్టుకొంటుండగా అడిగాను "యూనివర్సిటీ కేనా?"

వాడు కొంటెగా నవ్వాడు. వాళ్ళమ్మ కల్పించుకొంది. "ఈ రోజు తన పుట్టిన రోజు. తనకు ఇష్టమొచ్చిన పనులే చేస్తాడు. కాలేజి, చదువు అంటూ వాడిని హైరానా పెట్టకండి. మీ క్రమశిక్షణ రేపటి నుంచి పాటిస్తాడులే".

"లేదమ్మా. కాలేజీకే వెళ్తున్నా. ఫ్రెండ్సును కలవాలిగా. డాడీ కొత్తకారు తీసుకెళ్తున్నా".

"జాగ్రత్త కాస్త అలవాటు పడే వరకూ...."

"ఓ డాడీ... యూనో... నాకు లైసెన్సు లేనప్పటి నుండి కూడా కారు డ్రైవ్ చెయ్యటం వచ్చుని... మీరే కదా మా వాడికి పదిహేనేళ్ళు లేవు. కారు బ్రహ్మాండంగా నడుపుతాడని మీ ఫ్రెండ్సుతో చెప్పేవారు. చూస్తు ఉండండి. ఎప్పుడో కారు పందెంలో ఫస్ట్ వచ్చేస్తాను.

"సరేసరే. పందెం సంగతి వేరు. ఆ సందర్భం వేరు. ప్రస్తుతానికి..."

"ఓకే డాడీ.. బై" నా మాట పూర్తి కాకుండానే వాడి కారు తుర్రుమంది.

మా వాడు ఎం.కామ్. ఫస్టియరులో ఉన్నాడు. చాలా తెలివైన వాడు. ప్రపంచంలో అన్ని విషయాలూ వాడికే తెలుసనిపిస్తుంది. మాటల్లో, వాదోపవాదాల్లో కూడా గట్టి వాడే. "మీలాగే గొప్పలాయరవుతాడని" చాలామంది అంటుంటారు. కాని నా తరం వేరు. ఆ బాధలు వేరు. మా వాడికి నాలా జీవన సంఘర్షణ ఉండకూడదు. అందుకే సివిల్ సర్వీసెస్ గురించి ఆలోచిస్తున్నాను. మా వాడు తప్పక సెలక్టవుతాడు. ఐ.ఎఫ్.ఎస్. లేదా ఐ.ఏ.ఎస్ అధికారి అవుతాడు. దేశ విదేశాలు పర్యటిస్తాడు. కాని ఏ విషయంలోను ఒత్తిడి తీసుకు వచ్చేమాటేలేదు. తనకు ఏది నచ్చితే అదే చేస్తాడు. వాడి మనసుకు కష్టం కలిగే పనులు ఏమీ మేము చెయ్యము గాక చెయ్యము.

రోజులు బిజీబిజీగా గడచిపోతున్నాయి. నా పనుల్లో నేను. శుభాంగి తన సమాజ సేవలో తాను... మా వాడి ప్రపంచమే వేరు. అందులో మాకు అర్థమయ్యేది కొంతే. అర్థం కానిది ఎంతో!

ఒక రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వచ్చిన సౌరభ్ చికాగ్గా కనిపించాడు. హాల్లో ఉన్న నన్ను గమనించనట్లే నేరుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు. భోజనానికి రమ్మని వాళ్ళమ్మ పిలిచే వరకు క్రిందకు రానేలేదు. భోజనాల దగ్గర మామూలుగా కబుర్లు, టివి చూస్తూ కామెంట్లు... అయినా ఏదో వాడిలో కొంచెం విసుగు కనిపిస్తోంది.

"సౌరభ్ ఏమయింది? కాలేజిలో ఏమైనా గొడవ పడ్డావా?"

"ఏం లేదు డాడీ దారిలో ఎవరో కారు కింద పడబోయారు".

"అరెరె. ఏం కాలేదు కదా" అంది శుభాంగి.

"ఏమవుతుందమ్మా! కళ్ళు కనిపించకుండా రోడ్డంతా వారి సొత్తయినట్లు నడుస్తారు. ఇవన్నీ మామూలే. నేనా బెదిరేది? కారు కూడా ఆపలేదు. నా అంతట నేను వచ్చేశాను".

"మరి ఆ మనిషి"

"శుభాంగీ నువ్వూరుకో. మన వాడికి ఏం కాలేదు. సంతోషించు. జాగ్రత్తగా ఉండాలి. రకరకాల వాళ్లుంటారు. ఊరికే గొడవలు పెట్టుకొంటారు. లేకపోతే డబ్బులు గుంజుతారు" మా వాడు పెద్దగా నవ్వేశాడు." నా దగ్గర ఆ పప్పులేం ఉడకవు. కాక పోయినా మా డాడీ గొప్పలాయర్. నాకేం భయం?" అన్నాడు గర్వంగా. "గుడ్ అలా ఉండాలి ధైర్యమంటే" అన్నాను.

మరుసటి రోజు నేనొక్కడినే ఇంట్లో ఉన్నాను. ఒక కేసుకు సంబంధించి పుస్తకాలు చూసుకొంటున్నాను. నన్ను చూడటానికి ఎవరో వచ్చారని ఈశ్వరయ్య చెప్పాడు. ముందు గదిలో కూర్చోబెట్టమని నేను వస్తున్నానని చెప్పాను. ఐదు నిమిషాలయ్యాక నేను వెళ్ళాను. అవతలి వ్యక్తి లేచి "నమస్కారం" అన్నాడు. నేను ప్రతి నమస్కారం చేశాను. "నా పేరు రఘునాథ్. పక్క వీధిలోనే ఉంటాను. మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను" అన్నాడు ఆ యువకుడు.

"మంచిది రఘునాథ్. మీకు ముందే ఒక విషయం చెప్పాలి. ఏదైనా కేసుకు సంబంధించిన విషయమైతే ఐయామ్ సారీ నేనిప్పుడు ఏ కొత్తకేసులూ తీసుకో లేను. నా ఇద్దరు అసిస్టెంటులు కూడా బిజీనే. కాని మీది పక్కవీధి అని నన్ను వెతుక్కుంటూ వచ్చారు. గనుక మీ కేసు చెపితే సలహా ఇవ్వగలను" అన్నాను.

"థాంక్యూ సార్. నేను వచ్చింది అందుకు కాదు"

"మరి...."

"నిన్న మీ అబ్బాయి కారు రాష్‌గా నడుపుతూ మా నాన్నగారికి తగిలించాడు. ఆయన క్రింద పడిపోయినా బండి ఆపకుండా ''కళ్ళు కనిపించడం లేదా ముసలాయనా" అని హేళన చేస్తూ వెళ్ళిపోయాడు"


నేను బిర్ర బిగుసుకుపోయాను.

రఘునాథ్ చెపుతూనే ఉన్నాడు. "సమయానికి ఎవరో చూశారు కాబట్టి మేము ఎలాగో ఆస్పత్రికి ఆయనను చేర్చాం. కాలు ఫ్రాక్చరయింది. ప్లాస్టరు వేశారు. ఇంకా ఆరు వారాలకు గాని ప్లాస్టరు తీసెయ్యరు. అప్పటికి కుదురుకుంటే సరి లేక పోతే మళ్ళీ ప్లాస్టరు వేసుకోవలసి వుంటుంది.

నాలోని లాయర్ మేల్కొన్నాడు. "ఇంతకూ ఏమంటారు? మా అబ్బాయిది తప్పంటారా?"

"కాదా మరి. ఎవరికి ప్రమాదం జరిగినా 'అయ్యో పాపం' అని ఆగి చూడ వలసింది పోయి తానే యాక్సిడెంటు చేసి, అవతలి వ్యక్తిని తిట్టి నిర్లక్ష్యంగా వెళ్ళి పోతాడా?" "చూడండి.

అన్నీ మీ తరఫునుండే మాట్లాడకండి. నిన్న మా అబ్బాయి ఈ సంగతి చెప్పాడు. ట్రాఫిక్ ఉన్నప్పుడు చూసి రోడ్డు దాటరా? ఇష్టమొచ్చినట్టు నడిస్తే స్పీడు కారులు




ఎలా ఆగుతాయి చెప్పండి. ఇదేం సైకిలు రిక్షానా, ఎద్దుల బండా?"

రఘునాథ్ మొహం బిగుసుకు పోయింది. "మరీ ఇంత అన్యాయంగా మాట్లాడతారేమిటండీ"

"అన్యాయమా! మీరా నాకు న్యాయాన్యాయాలు చెప్పేది? ట్రాఫిక్ చూసుకోకుండా రోడ్డు దాటటం ఒక తప్పు. కారు నడిపే వాళ్ళను తికమక పెట్టటం మరో తప్పు. అంతగా రోడ్డు దాటలేని స్థితిలో ఎవరి సాయంతోనైనా బయటకు రావాలి గాని సమాజమంతా మీ బాగోగులే చూసుకోటానికి ఉందని వీరుల్లా బయలుదేరటం ఇంకో తప్పు...."

"స్టాప్ ప్లీజ్. మా నాన్నగారేమంత వయోవృద్ధులు కారు. నడవలేని స్థితిలోనూ లేరు. మహా అంటే మీకంటే నాలుగయిదేండ్లు పెద్దవారు కావచ్చు. ఈ యాక్సిడెంట్ చిన్నా పెద్దాభేదం లేకుండా ఎవరికైనా జరగొచ్చు. మీ పిల్లలను గారాబం చేసి, జేబుల నిండా డబ్బులు పోసి, స్పీడ్ కార్లిచ్చి రోడ్డు మీదకు వదిలేస్తారే.... అదండీ మీ తప్పు. కాస్త మంచీ చెడ్డాచెప్పి పిల్లలను అదుపులో ఉంచుకోరా అండీ..."

"మా వాడిని మేమెలా పెంచుకొంటామో మా ఇష్టం. మీరేం పాఠాలు చెప్పక్కరలేదు".

"మీ ఇష్టం మీ ఇంట్లోనేనండీ వీధుల్లో కాదు. ఇప్పుడు ఆరు వారాలు మా నాన్నగారు ఇంటి నుండి కదిలే స్థితిలో లేరు. పైగా ఆస్పత్రి. ట్రీట్‌మెంట్. ఖర్చులు.

"అదా మీ బాధ? నష్టపరిహారం కోరుతున్నారా?"

ఆ అబ్బాయి నన్ను మింగేసేలా చూశాడు. ఛీత్కరిస్తున్నట్టు "అన్నీ డబ్బుతోనే కొలవకండి. మీ సంపదలు మీ వద్దే పదిలంగా ఉంచుకోండి. మీ అబ్బాయికి ఏ హెలికాప్టరో, విమానమో కొనిద్దురు, గాని ఎవరినెత్తినయినా కూల్చటానికి" అని విసురుగా వెళ్ళిపోయాడు.

నాకూ అతనితో ఆ విధంగా మాట్లాడడం సబబనిపించలేదు. కాని మా అబ్బాయిని ఏమయినా అంటే మొత్తం ప్రపంచాన్నయినా ఎదిరించగలను. నాకున్న అమూల్య సంపద, పంచప్రాణాలు, నా జీవితానికి ధ్యేయం, లక్ష్యం అన్నీ మా సౌరభే.

దీపావళి ముందు రాత్రి మా సౌరభ్ తయారయి వెళ్తున్నాడు. "ఎన్ని గంటలకు వస్తావు బాబూ? భోజనం చేసి వెళ్తావా ఏమిటి?" అని శుభాంగి అడిగింది.

"లేదమ్మా. ఫ్రెండు పార్టీ ఇస్తున్నాడు. అందరం కలుస్తున్నాము. రావటానికి లేటవుతుంది" అన్నాడు వాడు కారు తాళం చెవులు చేతిలో ఆడిస్తూ.

"జాగ్రత్త. పార్టీ అంటూ మరీ ఆలస్యం చేయకు" అన్నాను.

వాడు సమాధానంగా నవ్వాడు.

"మితిమీరకు" అన్నాను.

కొంటెగా కన్ను కొట్టాడు. "డోంట్ వర్రీ డాడీ. బై వస్తానమ్మా" అని శరవేగంతో కారు చేరుకొన్నాడు. వీడంతే. ఎప్పుడూ స్పీడు. వాడి ఎనర్జీ లెవల్ నన్ను ముగ్ధుణ్ణి చేస్తుంటుంది.

ఎప్పుడయినా ఫ్రెండ్సుతో పార్టీలు చేసుకొంటున్నప్పుడు సౌరభ్ ఆలస్యంగా రావటం మాకు అలవాటే. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. ఎంత పార్టీ అయినా కంట్రోల్‌లోనే ఉంటాడు.

పిల్లలు, యంగర్ జెనరేషన్, ఇప్పుడు కాకపోతే ఎప్పుడు ఎంజాయ్ చేస్తారు? మనం కాలేజి రోజుల్లో గడిపినట్లే ఇప్పుడూ వాళ్ళను గడపమనటం న్యాయమూ కాదు, సాధ్యమూ కాదు. ఆ రోజుల్లో సెకండ్ షో సినిమాకు వెళ్ళాలన్నా, సిగరెట్ కాల్చాలన్నా, కనీసం బీరు తాగాలన్నా భయపడి చచ్చే వాళ్ళం. ఇంట్లో సవాలక్ష ప్రశ్నలు. నిజం తెలిస్తే తిట్లు. కొట్టటం తక్కువగా అంత హడావుడీ జరిగేది. అప్పుడు మనసులెంత బాధ పడేవి! అందుకే నా కొడుక్కు అటువంటి సంకెళ్ళు నేను వేయ దలచుకోలేదు. కాకపోయినా వాడికేం తక్కువ. వాడికేమి కావాలన్నా సమకూర్చటానికి నేనున్నాను కదా! వాడి పెదవులపై చిరునవ్వు, కళ్ళలో మెరుపు, ఈలపాటలోని హుషారు నాకిచ్చిన ఆనందం మరే విధంగానూ నేను పొందలేను.

శుభాంగి లేచినట్టుంది "టైమెంతయింది?" అని అడిగాను.

"రెండు గంటలు కావస్తోంది. మీకు మంచి నీళ్ళు కావాలా?" అని అడిగింది తాను మంచి నీళ్ళు తాగుతూ.

వద్దన్నాను. రాత్రి రెండయినా సౌరభ్ రాకపోవటమేమిటి? ఎన్నడూ ఇంత ఆలస్యం చేయలేదు. కనీసం ఫోనయినా చేయలేదు. నేను ఫోను చేద్దామంటే సాధారణంగా పార్టీలు చేసుకొనేప్పుడు వీళ్ళ మ్యూజిక్, డ్యాన్సుల్లో సెల్‌ఫోన్ ఆఫ్‌లో ఉంటుంది లేదా దాని మోత పట్టించుకోరు.

ఇంతలో కారు చప్పుడయింది. నేను లేచి ఇవతలకి వచ్చాను. సౌరభ్ చాలా కంగారుగా ఉన్నాడు. "ఏం నాన్నా ఏమయింది?" అన్నాను.

"చాలా పొరపాటు జరిగింది డాడీ" అన్నాడు మనిషి నిలువెల్లా వణికిపోతున్నాడు.

"కూర్చో. కూర్చో. మంచి నీళ్ళు తాగుతావా?" అప్పటికే శుభాంగి మంచి నీళ్ళ గ్లాసుతో వచ్చింది. వద్దంటూ చేత్తో పక్కకు నెట్టాడు.

"ఏమయింది సౌరభ్? మమ్మల్ని కంగారు పెట్టక చెప్పరా. నువ్వు బాగానే ఉన్నావు కదా. నీకేమీ కాలేదు కదా!" శుభాంగి ప్రశ్నల పరంపర కురిపిస్తూనే ఉంది.

"నువ్వూరుకో. వాడిని కంగారు పెట్టకు. చెప్పు నాన్నా. ఏమయింది?" పక్కన కూర్చుని అనునయిస్తూ వాడి మీద చెయ్యివేసి అడిగాను.

"డాడీ ఆక్సిడెంటయింది. కారు పేవ్‌మెంట్ ఎక్కేసింది. ఎవరిమీదనో కారు నడిపేశాను. బతికారో చచ్చారో తెలీదు. అరుపులు వినిపిస్తున్నా యమస్పీడుతో వచ్చేశాను"

నేను అవాక్కయ్యాను. "డోంట్ వర్రీ. నేను చూసుకొంటాను. యాక్సిడెంటు ఎక్కడయింది?"

"సాయిబాబా గుడి క్రాసింగ్ ముందు..."

"జనమెవరూ లేరు కదా"

"ఎవరూ తిరుగుతున్నట్టనిపించలేదు"

"భిక్షగాళ్ళు వగైరా.... కారు నంబరెవరయినా చూశారంటావా?

"వీలు కాకపోవచ్చు. రాత్రి పూట కదా!"

"గెటప్. గెట్ రెడీ" అన్నాను ఆదుర్దాగా.

"ఎక్కడికి డాడీ".

"నేనిప్పుడే ఏర్‌పోర్టుకు ఫోను చేసి నీకు ఢిల్లీ ఫ్లైటుకు టిక్కెట్ బుక్ చేస్తాను.

ఆ తర్వాత నువ్వు నేపాల్‌కు వెళ్ళిపో. నా ఫ్రెండు థాపాతో మాట్లాడుతాను. ఆయన నేపాలులో ఏర్పాట్లు చూసుకొంటాడు. అన్ని ఏర్పాట్లు చకచక జరిగి పోయాయి. టాక్సీ వచ్చింది. మా వాణ్ణి ఏర్‌పోర్టుకు పంపించాను.

ఫోన్ చేసి గంగాధరాన్ని రమ్మన్నాను.

అతనికి గేరేజి ఉంది. అతను నాకు బాగా తెలుసు. నాకు ఎన్నో పనుల్లో సాయపడ్డాడు. "గంగాధరం మరో ప్రశ్న అడక్కు. ఈ కారు తీసుకెళ్ళి రిపేర్లు చేసి రంగు మార్చేసెయ్. నీ ఎంట్రీలో ఇది మధ్యాహ్నాం నీ దగ్గరకు వచ్చినట్లుండాలి".

"ఒకేసార్"

కారు గేరేజీకి వెళ్ళిపోయింది. అప్పటికే దీపావళి పటాకాలు మోగుతున్నాయి. ఆ రోజంతా వచ్చిపోయే జనం. కానుకలు. పండుగ శుభాకాంక్షలు. అన్నీ మామూలు గానే ఉన్నా మా వాడి ఫోను కోసం ఎదురుచూస్తున్నా. టెన్షన్ పెరిగి పోతోంది. పదిన్నరకు ఫోను వచ్చింది. ఢిల్లీ నుంచి.

"ఏమయింది. సౌరభ్" అని అడిగాను.

"ఇంకో గంటలో నేపాల్ ఫ్లైట్‌కు వెళ్తున్నాను... అక్కడ ఎలా ఉంది డాడీ".

"అంతా మామూలుగానే ఉంది. నేనున్నానుగా అన్నీ చూసుకొంటాను. నువ్వు ఎవరితోనూ నోరు విప్పి ఏం మాట్లాడకు. థాపా అంకుల్‌కు ఫోను చేశాను. నీవు హాలీడేస్‌కు వస్తున్నావని చెప్పాను. ఇప్పుడు నీ ఫ్లైట్ నంబరు, టైము చెపుతాను. ఎవరినైనా పంపి నిన్ను రిసీవ్ చేసుకొంటాడు".

సౌరభ్ నుంచి వివరాలన్నీ తీసుకొన్నాను. థాపాకు చెప్పాను. ఆ మధ్యాహ్నాం భోజనాల సమయానికి మావాడు నేపాల్ చేరుకొన్నాడు. ''అమ్మయ్య'' అనుకొన్నాను.

ఈవినింగ్ పేపర్లో ఈ యాక్సిడెంట్ గురించి వచ్చింది. ఒక కూలీ కుటుంబం పేవ్‌మెంట్‌మీద పడుకొని వుంటే ఒక కారు స్పీడుగా వచ్చి మనుషుల మీదుగా పోయిందని, ఒక మనిషి చనిపోయాడని. చిన్న పిల్లవాడికి కాలు విరిగింది. స్త్రీకి స్వల్ప గాయాలు. "మైగాడ్" అనుకొన్నాను. నాకు నెర్వస్‌గా ఉంది. నన్ను నేను కంట్రోల్‌లో పెట్టుకోవడం కష్టంగా ఉంది. శుభాంగికి అన్ని వివరాలు తెలీవు. ఎవరితో ఏమీ మాట్లాడవద్దని గట్టిగా హెచ్చరించాను. సౌరభ్ గురించి అడిగితే మాత్రం ఫ్రెండ్సుతో ఏదో ఊరికి వెళ్లాడని చెప్పమన్నాను.

ఆ రాత్రి ఊరు ఊరంతా హడావుడే. టపాకాయలు మోగి పోతున్నాయి. వెలుగులు, జిలుగులు, కాంతి పుంజాలు... కానీ నా గుండెల్లో మాత్రం ఆటం బాంబులు.

మరునాడు ఉదయం ఇంటికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ వచ్చాడు. అతనితో నాకు మంచి పరిచయం. స్నేహం.

"ఏమిటి నిన్న పండుగయితే ఈ రోజా మీరు శుభాకాంక్షలు చెప్పేది" అన్నాను నవ్వుతూ.

"ఆలస్యంగానైనా చెప్పాలనే వచ్చాను" అన్నాడు అతను మర్మంగా.

కాఫీ ఫలహారాలయ్యాక ఆ కేసు గురించి తెలుసా అన్నాడు సూటిగా నా కళ్ళలోకి చూస్తూ.

"ఈ రోజు ఉదయం పేపర్లో చూశాను. హారిబుల్" అన్నాను చూపు మళ్ళిస్తూ.

"సౌరభ్ కనిపించలేదే" అన్నాడు యథాలాపంగా.

"ఏదో ఊరు వెళ్ళాడు సరదాగా" అన్నాను.

"నిన్న ఉదయమా?" అన్నాడు శేఖరు.

నేను మౌనంగా అతన్నే చూస్తున్నాను.

అతను లేచాడు. "ఆ మధ్య సౌరభ్ ఎర్రకారులో స్పీడుగా వెళ్తుంటే చూశాను. తను నన్ను గమనించలేదు"

"వాడంతే" అన్నాను తేలిగ్గా.

"ఇక వెళ్తాను. ఆ హిట్ అండ్ రన్ కేసు నేనే చూస్తున్నాను. కొన్ని క్లూలు దొరికాయి.

"కేసు నడుస్తుందా?"

"నడవాలి కదా. పాపం పేద కుటుంబం. ఏ రోజు కారోజు కూలీ పనులు చేసుకు బతికే వాళ్ళు. సంపాదించే ఒక మగవాడూ పోయాడు. చిన్న కుర్రాడికి కాలు విరిగి ఆస్పత్రిలో ఉన్నాడు. ఆ తల్లి దిక్కులేనిది ఏమి చేస్తుంది? లబోదిబో మని ఏడుస్తోంది".

"మీరిప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు?".

"ఒకసారి ఆస్పత్రికి వెళ్ళి....

"నేనూ రానా?"

అతని కళ్ళలో ఎన్నో ప్రశ్నలు.

''పాపం ఆ కుటుంబానికి...'' నా మాట ఆగిపోయింది.

" ఏం చేయగలరు?"

"ఆ అబ్బాయికి వైద్యం. వాడి భవిష్యత్తు నేను చూసుకొంటాను. ఆ తల్లికి ఒక లక్ష రూపాయలదాకా నగదు ఇస్తాను. వాళ్ళిక్కడే మా అవుట్ హౌస్‌లో ఉండొచ్చు"

రెండు నిముషాల మౌనం నా గుండెల మీద నాట్యమాడుతోంది. ఏమాట ఎక్కువో, ఏ మాట తక్కువో అని సతమతమవుతున్నాను.

"చాలా అన్యాయం" అన్నాడు శేఖర్ చివరకు.

నా కళ్లలో దైన్యం అతనిని కదిలించింది.

"ఏలాగూ సాక్ష్యాలు లేవు. కేసు క్లోజు చేయాలేమో అనుకొన్నాను. కానీ నా సిక్స్‌త్ సెన్స్ నన్నిక్కడికి తీసుకొచ్చింది. మీరు చేసేవన్నీ దయతో చేశారనే అందరూ అనుకొంటారు. నాకు మాత్రం...

"ప్లీజ్ శేఖర్" అన్నాను ప్రాధేయ పడుతున్నట్టు. "ఒక మాట చెపుతాను. ఏమీ అనుకోకండి. మీ దృక్పథం మార్చుకోక తప్పదు. ఎవరి కోసం మీరివన్నీ చేస్తున్నారో ఆ వ్యక్తినే ఇటువంటి సందర్భాలలో మీరు పోగొట్టుకొంటారు. అనుభవజ్ఞులు. న్యాయం తెలిసినవారు. మీరీ మాత్రం గ్రహించలేరా?".

ఒక నిముషం ఏమీ మాట్లాడలేక పోయాను. పెల్లుబికుతున్న దుఃఖాన్ని దిగ మింగుకున్నాను. చివరకు నా ధైర్యమంతా కూడగట్టుకొన్నాను.

"సరే మీరు మీ పని కానివ్వండి. నేను సౌరభ్‌ను పిలిపిస్తాను. స్వయంగా తానే వచ్చి మీకు స్టేట్‌మెంట్ ఇస్తాడు".

▲

## మమకారానికి సాకారం

నాకు అన్నం ముద్దై
ఆకలితో కడుపు నింపుకునేది
నాకోసం చుక్క పొద్దై
ఎన్ని రాత్రులను నిద్రపుచ్చిందో
కళ్లలో దివిటీలు పెట్టుకుని
ఎన్ని చీకట్లకు తెర దించిందో
నాకు దుప్పటిగా మారి
ఆమె చలికి వణుకు పుట్టించేది
నాకు ఆవేదన కలిగినప్పుడల్లా
ఆ కళ్ల నదులై ఉప్పొంగేవి
నేను పరీక్ష పాసైతే
తాను డాక్టరేట్ పొందినట్లు
ఆనందంతో తొణికిసలాడేది
పండు ముదుసలి అయినా
నా కోసం ఎండుటాకయ్యేది
నా బ్రతుకు కోసం, ఆమె
చేతులెపుడూ పనితో పోటీ పడేవి
ఆమె గుండెల్లో
ఎన్ని లావాలు ఎగిసిపడుతున్నా
ఎప్పుడూ మంచుకొండలా
ద్రవీభవిస్తూనే ఉండేది
ప్రేమ ఆమె పాదాల ముందు
మోకరిల్లుతుంది
త్యాగం ఆమె ఎదుట
తలదించుకుంటుంది
ప్రేమ, త్యాగాల సంగమం
దయా సుధల సాగరం
మమకారానికి సాకారం
అనురాగానికి ఆకారం
సహనానికి మరో జన్మ
సరితూగదు స్వర్గసీమ
ఆమె అమ్మ!
అమ్మకు భాష్యం అమ్మే
అమ్మను మించిన జన్మ లేదు
అందుకే అమ్మ లాలన కోసం
అందరికీ జన్మనిచ్చే దేవుడు కూడా
అమ్మ కొడుకై జన్మించాడు
ముమ్మూర్తులా త్రిమూర్తులే
అమ్మ 'అనసూయ' వొడిలో బాలలైనారు
అమ్మతనం కోసం తపించి తపించి
ఆది దేవత కూడా ఆమె అవతారం ఎత్తింది

**-వై. హెచ్. కె. మోహన్‌రావు**